క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయుడు ఉస్మాన్

గోనెగండ్ల: పదవ తరగతిలో ప్రతిభ చాటిన (2023–24) మండల కేంద్రం గోనెగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం గణిత ఉపాధ్యాయుడు జె. ఉస్మాన్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాగభూషణంతో కలిసి విద్యార్థుల తలిదండ్రులకు ఇచ్చారు. రూపారాణికి రూ.3వేలు, సైనాజ్‌కి రూ.2వేలు, ఐశ్వర్యకు రూ. వెయ్యి చొప్పున అందజేశారు. పదిహేనేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయుడు ఉస్మాన్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

టాపర్లకు నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్

కౌతాళం: పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, వీరభద్రగౌడ్ నగదు ప్రోత్సాహకం అందజేశారు. మండల పరిధిలోని బదినేహాల్ జెడ్పీ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, కన్నడ మీడియంలలో అత్యధిక మార్కులు సాధించిన తొమ్మిది మంది టాపర్లకు (ఒక్కో మీడియంలో ముగ్గురికి) శుక్రవారం ఎస్‌ఎంసీ చైర్మన్ వలి, ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావుల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఇంగ్లిష్ మీడియంలో అల్లీపీరా, ఖాదర్‌బాషా, యశోద, కన్నడ మీడియంలో సానియా, రమాదేవి, గంగోత్రి, తెలుగు మీడియంలో మమత, మల్లేశ్వరి, అభిషేక్ నగదు అందుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



ట్యాంక్ బండ్ రోడ్‌లోని డ్రైన్‌లో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గాంధీ నగర్, ట్యాంక్‌బండ్ రోడ్డులోని మురుగు కాలువల పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ప్రధాన కాలువలో పూడిక పేరుకొని పోవడంతో తీయిస్తున్నామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి



ఇన్‌చార్జ్ డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో విద్యార్థిని పార్వతి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస యశ్వంత్‌రాజు శుక్రవారం ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ సోమన్నకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థిని మృతిపై అనేక సందేహాలు ఉన్నాయని వారు ఫిర్యాదు చేశారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: ప్రధానిగా దేశానికి సేవలందించిన అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను వారు కొనియాడారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీకాంత్ గుప్తా, సభ్యులు వన్నపరాజు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కౌతాళం: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచులు హాజరు కావాలని కోరారు.

చందాలేసుకుని పంప్‌హౌస్‌కు మరమ్మతులు

- సాగునీటి కోసం రైతుల అవస్థలు
- రూ.3 లక్షలు పోగు చేసి ఒక మోటార్ రిపేరీ
- ఎట్టకేలకు రిజర్వాయర్‌కు నీటి విడుదల
- పట్టించుకోని ప్రభుత్వం, జీఆర్‌పీ అధికారులు
- మరో మోటార్‌ను బాగు చేయించాలని డిమాండ్



మూగలదొడ్డి పంప్‌హౌస్ మోటార్‌ను ప్రారంభిస్తున్న రైతులు



రిజర్వాయర్‌కు చేరుతున్న నీరు

కోసిగి: గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్‌లలో భాగంగా మండలంలోని మూగలదొడ్డి పంప్‌హౌస్‌ను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో నేరుగా రైతులే చేయిచేయి కలిపి రూ.3 లక్షలు పోగుచేసి మరమ్మతులు చేయించుకున్నారు. శుక్రవారం పంప్‌హౌస్‌లోని ఒక మోటార్‌ను బాగుచేయించి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సోమేష్, చంద్రాస్, వీరారెడ్డి, బంగి ఈరన్న, కురువ వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 11న గుర్తు తెలియని దుండగులు పంప్‌హౌస్ వద్ద చోరీకి పాల్పడి సామగ్రిని ఎత్తుకెళ్లారన్నారు. దీంతో మోటార్లు పనిచేయక పంప్‌హౌస్ నిరుపయోగంగా మారిందని చెప్పారు. మోటార్లను బాగు చేయించి రిజర్వాయర్‌కు సాగునీటిని విడుదల చేయాలని రైతులు పలుమార్లు జీఆర్‌పీ అధికారులకు విన్నవించినా ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు వచ్చిన తర్వాత మరమ్మతులు చేయిస్తామని చెబుతూ వచ్చారు.

3700 ఎకరాల ఆయకట్టు

మూగలదొడ్డి రిజర్వాయర్ కింద మూగలదొడ్డి, కామన్‌దొడ్డి, కొల్మాన్‌పేట, చిర్తనకల్లు, సాతనూరు కొట్టాల, జంపాపురం గ్రామాల వరకు 3700 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. గత జూన్‌లో కురిసిన వర్షాలకు ఇక్కడి రైతులు పత్తి, వేరుశనగ, ఉల్లి పంటలు సాగుచేశారు. ఆ తర్వాత సరైన వర్షాలు లేకపోవడంతో పైర్లు ఎండు ముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. అందరూ కలిసికట్టుగా మాట్లాడుకుని పంటలను కాపాడుకునేందుకు ఎకరానికి రూ.వెయ్యి చొప్పున పోగు చేసుకుని దాదాపు రూ.3 లక్షలు వరకు ఖర్చు చేసి పంప్‌హౌస్ వద్ద ఒక మోటారును బాగు చేయించుకున్నారు. ఈ మోటార్‌ను శుక్రవారం ప్రారంభించడంతో సాయంత్రం రిజర్వాయర్‌లోకి నీరు చేరుతోంది. దీంతో రైతులందరూ ఊరట చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జీఆర్‌పీ అధికారులు స్పందించి రెండవ మోటార్‌ను బాగు చేయించి రిజర్వాయర్‌ను నీటితో నింపి సాగు నీటిని అందించాలని కోరుతున్నారు.

ఎకరాకు రూ.వెయ్యి చొప్పన ఇచ్చాం



మూగలదొడ్డి రిజర్వాయర్ కింద నాకు 4 ఎకరాల భూమి ఉంది. ముందస్తు వర్షాలకు పొలంలో పత్తి, ఉల్లి పంటలు సాగుచేశాను. తర్వాత నెల రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో పైర్లు వాడుముఖం పట్టాయి. ఎప్పటి మాదిరిగానే పంప్‌హౌస్ నుంచి సాగునీరు వస్తుందని ఆశపడ్డాం. మోటార్లు మరమ్మతులకు గురికావడంతో నీరు రాలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులందరం కలిసి ఎకరానికి రూ.వెయ్యి ప్రకారం చందాలేసుకుని ఒక మోటార్‌ను బాగు చేయించుకున్నాం. – బంగి ఆదెప్ప, మూగలదొడ్డి

ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు



మూగలదొడ్డి పంప్‌హౌస్‌లో మోటార్లు గత ఏప్రిల్ నుంచి మరమ్మతులకు గురైన విషయం అధికారులకు తెలుసు. నదికి నీరు వచ్చేలోగా మరమ్మతులు చేయించాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపాం, నిధులు వచ్చిన వెంటనే రిపేర్ చేయిస్తామని చెప్పారు. కళ్లముందే పంటలు ఎండిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులందరం కలిసి సొంతంగా మోటారును మరమ్మతులు చేయించుకున్నాం. ప్రభుత్వం మరో మోటార్‌ను బాగు చేయించి సాగునీరు అందించాలి. – సోమేష్, మూగలదొడ్డి, గ్రామం

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుతోపాటు అనంతపురం జిల్లా నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నదిలో దూకిన మహిళ

మంత్రాలయం: ఏ కష్టమొచ్చిందో తెలియదు గానీ ఓ మహిళ తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. వివరాలివి.. ఆస్పరి మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన తిక్కలక్ష్మి (45) శుక్రవారం మంత్రాలయం వచ్చింది. సాయంత్రం పాతూరు వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా తుంగభద్ర నది వద్దకు వెళ్లి ఉన్నపాటున దూకేసింది. ఆ పక్కనే ఆడుకుంటున్న చిన్నారులు కేకలు వేయడంతో గ్రామస్తులు పరుగున వచ్చి ఆమెను ఒడ్డుకు చేర్చారు. కానిస్టేబుల్ రంగస్వామికి సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని ప్రైవేటు కారులో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. బాధితురాలి ఊపిరితిత్తుల్లోకి నీరు చేరినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. తిక్కలక్ష్మికి వివాహం కాలేదని, బంధువులకు సమాచారం అందించినట్లు కానిస్టేబుల్ తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు



ఏఐటీయూసీ జాతీయ సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేట్, కార్పొరేట్ రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప విమర్శించారు. సెప్టెంబర్ 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళన పోస్టర్లను శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్‌ను ప్రోత్సహిస్తూ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలపై ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, నాయకులు నరసింహులు,వీరాంజిగౌడ్, దాదావలి,వీరేష్, ఖాజ,విజయ్, వీరేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం



ఐక్యత తెలుపుతున్న బీఎస్‌ఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అభ్యున్నతే బీఎస్‌ఎస్ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం బీఎస్‌ఎస్ 8వ జాతీయ మహాసభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం బలహీన వర్గాలు అన్యాయానికి గురయ్యారన్నారు. హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఎస్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడిగా రామతీర్థం అమరేష్, జాతీయ పారిశ్రామిక విభాగ కన్వీనర్‌గా న్యాయవాది సునీల్‌కుమార్‌ను, విద్యపాలసీ సలహాదారుడిగా ఎరుకుల కృష్ణ, బీసీ కన్వీనర్‌గా ఈరన్న, కార్యకర్తల సంక్షేమ నిధి కార్యదర్శిగా బోయ దేవేంద్రను ఎన్నుకున్నారు. వీరితో హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హనీఫ్, హకీమ్, ఇస్మాయిల్, ఖదీర్, వసుందర, లక్ష్మమ్మ, బతుకన్న, లక్ష్మి నారాయణ, మాల నరసప్ప పాల్గొన్నారు.

వైద్యురాలికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలోని ఆర్‌జీకార్ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై అఘాయిత్యం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆమెకు సంతాపంగా శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖాశింవలీ మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాదా ఖలందర్, అనంత్‌కుమార్, విష్ణు, రాజు, విజయ్, హర్ష, వినోద్, హరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి ఆపరేషన్లు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: స్థానిక ఎస్‌కేడీ కాలనీ 3వ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి వద్ద ఈనెల 18న దాత కాకుబాళ్ నగేష్ సహకారంతో శాంతిరామ్ ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన ఉచిత కంటి ఆపరేషన్లకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌గుప్తా మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శులు నాయకంటి రఘు, కోశాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ రంజిత్, అవోపా మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, గీతశ్రీదేవి, అనూష పాల్గొన్నారు.

అత్యధిక భాగం తమరికే ఇచ్చాం మీనాక్షీ!

ఆదోని అర్బన్: నియోజకవర్గంలో అత్యధిక భాగం వాటాలు తమరికే ఇచ్చామని, తమ నిర్లక్ష్యం వల్ల చేయి దాటిపోయిందని అనడం టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుకు తగదని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాష్‌జైన్ మాట్లాడారు. ఎమ్మెల్యే పార్థసారథికి లిస్ట్ పంపండం, పరిశీలన చేసి మీ విషయంలో కించపరచకుండా తగిన న్యాయం చేస్తారని చెప్పారు. నాకే అంతా కావాలని, నాదే జరగాలని అనడం పద్ధతి కాదన్నారు. బీజేపీకి బలం లేదని అంటున్నావు కదా బలం పెంచుకునేందుకు పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తున్నామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మొలగవల్లి ప్రజలతో మాట్లాడుతున్న ఆలూరు సీఐ శ్రీనివాసులు నాయక్

ఆలూరు రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో ఎస్‌ఐ నరసింహులుతో కలిసి పర్యటించి విపత్తులు, నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు చెప్పవద్దన్నారు. వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాల నుంచి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మహిళలు,యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌కుమార్

కోసిగి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు వేళకు రావడం లేదని, ఆశావర్కర్లు కమీషన్ల కోసం గర్భిణులను చెకప్ చేయించుకునేందుకు ఆదోనిలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్న తీరుపై మండల సభ్యులు ఎంపీటీసీ నాడుగేని భీమక్క, అర్లబండ ఎంపీటీసీ తాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులను చెకప్ నిమిత్తం ఆశావర్కర్లు ప్రవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్న విషయం తెలియదని విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో స్కానింగ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని సభ్యులు కోరారు. ఏఓ రాజు మాట్లాడుతూ.. మండలంలో జూలై, ఆగస్ట్ నెలల్లో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కోసిగిలోని నాడుగేని వీధి, కడపాళెం వీధిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ హారూన్ రషీద్ సూచించారు. దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, గ్రామాల్లో ఫాగింగ్ చేయడం లేదని సభ్యులు ఆరోపించారు. దోమలు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, నీరు వృథా కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్లెల్సీ ఏఈ రాజేష్ తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఎంఈఓ–2 నాగేషప్ప, ఆర్‌ఐ శ్రీరాములు, పీఆర్‌ఏఈ నరసింహులు, కో–ఆప్షన్ మెంబర్ షౌకత్ అలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటుగ్రామాల్లో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, ప్రత్యేకపూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోనెగండ్లలో వీరశైవమతం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళహారతి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పర్యటించారు. పారిశుధ్య, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అవినీతి పరులే పార్టీలు మారుతారు

- వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు దేవా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షులు దేవా

ఆదోని రూరల్: అవినీతి పరులే తరచూ పార్టీలు మారుతూ ఉంటారని, ప్రజా సేవ చేసే వారు ఎప్పటికీ తమ పార్టీని వీడరని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు దేవా, నాయకుడు ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇటీవల బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ప్రెస్ మీట్‌లో వైఎస్సార్‌సీపీ నుంచి నాయకులు తమ పార్టీలలో చేరుతున్నా ఆ పార్టీ వారు స్పందించడం లేదని అర్థం పర్థం లేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీపీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లడం సహజమేనని, అలాంటి వారికి ఎక్కడా గుర్తింపు ఉండదన్నారు. ఇటీవల పార్టీ మారిన ఎంపీపీ వెంట సర్పంచులు గానీ, ఎంపీటీసీలు గానీ వెళ్లలేదన్నారు. జగనన్న కాలనీలోనూ, మరొ కొన్ని కోట్ల భూదందా చేసినట్లు తమకు ఈమధ్యే తెలిసిందని, అవినీతికి అలవాటుపడిన వీరు పార్టీలు మారుతూ ఉంటారని తెలిపారు.

కౌతాళంలో మోస్తరు వర్షం



వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కౌతాళం: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, జేకేఎల్‌ఎస్ నగర్‌లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. అరగంటకు పైగా కురిసిన వానతో గ్రామం తడిసి ముద్దయ్యింది. ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

మార్కెట్ యార్డును పరిశీలించిన సబ్ కలెక్టర్



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని అర్బన్: అరగంటసేపు కురిసిన వర్షానికి ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన వేరుశనగకాయలు తడిచి కొట్టుకుపోయిన విషయాన్ని తెలుసుకున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం రాత్రి పరిశీలించారు. డ్రెయినేజీ శుభ్రం చేస్తున్నారా లేదా అని యార్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు అంతా కలియతిరిగారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. ఆయన వెంట యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఉన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు అభినందన

కోసిగి: జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో.. కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు మల్లికార్జున రెడ్డి, బాబు, అర్షియా, అఖిల్, గోవిందమ్మ కవాతు నిర్వహించి ప్రశంసలందుకున్నట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో వారిని మెడల్స్‌తో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కోసిగి మోడల్ స్కూల్ నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ పోగ్రామ్ కింద 26 మంది కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శిక్షకులు రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు వైద్యసేవలు బంద్

ఆదోని అర్బన్: కోలక్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ ఆదోనిలో శనివారం 24 గంటలపాటు వైద్యసేవలు (ఎమర్జెన్సీ సేవలు మినహా) నిలిపివేయనున్నట్లు ఐఎంఏ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైద్యులకు రక్షణ చట్టాలు తేవాలని, దాడులు, అఘాయిత్యాలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున వైద్యులు ఆందోళనలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.